ఎన్నికల వేళ.. చేరికల మేళా

- కాంగ్రెస్‌లో చేరుతున్న గులాబీ శ్రేణులు
- నాగర్‌కర్నూల్ నియోజకవర్గం నుంచి ఆపరేషన్ ఆకర్ష్..
- తెలకపల్లి, బిజినేపల్లి మండలాలపై ప్రధానమైన దృష్టి
- ఇప్పటికే కాంగ్రెస్ కండువా కప్పుకున్న పలువురు నాయకులు



నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన తెలకపల్లికి చెందిన బీఆర్ఎస్ ముఖ్యనాయకులు (ఫైల్)

నాగర్‌కర్నూల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు రంగం సిద్ధమవుతున్న వేళ నాగర్‌కర్నూల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఆపరేషన్ ఆకర్ష్‌ను ప్రారంభించింది. నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్ నియోజకవర్గాలల్లోని 661 గ్రామపంచాయతీలల్లో ఎన్నికలను ప్రభావితం చేసే ముఖ్య నాయకులపై దృష్టిని కేంద్రీకరించింది. మొదట సర్పంచ్ ఎన్నికలు నిర్వహిస్తారని ప్రచారం జరుగుతున్న క్రమంలో మెజార్టీ స్థానాలను గెలుపొంది మండల, జిల్లా పరిషత్ స్థానాలను కైవసం చేసుకోవాలని భావిస్తున్న కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా పావులను కదుపుతోంది. రేవంత్‌రెడ్డి సర్కార్ టీపీసీసీలో ప్రత్యేకంగా మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేసింది. మండలాల వారీగా బీఆర్ఎస్‌లో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న నాయకుల జాబితాను సేకరిస్తున్న ప్రత్యేక బృందం ఆయా నియోజకవర్గాలకు సంబంధించిన ఎమ్మెల్యేలకు సమాచారాన్ని చేరవేస్తోంది. ఈ క్రమంలో నాగర్‌కర్నూల్‌లో బీఆర్ ఎస్‌కు చెందిన ప్రధానమైన నాయకులు కాంగ్రెస్ గూటికీ చేరుతున్నారు. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత బిజినేపల్లి మండలంలో బీఆర్ ఎస్‌కు చెందిన మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ మాజీ సభ్యులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. రెండు రోజుల్లో మహదేవునిపేట మాజీ సర్పంచ్ తిరుపతి రెడ్డి చేరిక అధికారికంగా ఖరారు కానుంది.

అచ్చంపేటలోనూ అదే పరిస్థితి..

అచ్చంపేటలోను బీఆర్ఎస్ పార్టీని ఖాళీ చేయించేందుకు ఎమ్మెల్యే వంశీకృష్ణ కంకణం కట్టుకున్నారు. అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బీజేపీలో చేరకముందే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో గువ్వల బాలరాజు ప్రధాన అనుచరులు పదర జడ్పీటీసీ మాజీ సభ్యుడు రాంబాబు, నరసింహ కాంగ్రెస్ పార్టీలో చేరారు. అచ్చంపేట నియోజకవర్గంలో లింగాల, అమ్రాబాద్, అచ్చంపేట మండలాల్లో బీఆర్ఎస్‌కు చెందిన ప్రధాన నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారని తెలుస్తోంది.

కల్వకుర్తిపై కాంగ్రెస్ కన్ను..

కల్వకుర్తి నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల కంటే ముందు పట్టుబిగించేందుకు కాంగ్రెస్ పార్టీ సమాయత్తమవుతోంది. కల్వకుర్తి బీఆర్ఎస్‌లో ఎవరికీ వారు యమునా తీరుగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో ఈ అవకాశాన్ని స్థానిక ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి సద్వినియోగం చేసుకోనున్నారు. ఈ నియోజకవర్గంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ప్రత్యేక దృష్టి పెట్టడంతో 10 రోజుల వ్యవధిలో కొత్త పరిణామాలు చోటు చేసుకుంటాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. సీనియర్ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న కొల్లాపూర్ ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావు కూడా కొల్లాపూర్ నియోజకవర్గంలో తన పట్టును నిరూపించుకు నేందుకు ఇప్పటికే చర్యలు ప్రారంభించారు. జిల్లా, మండల పరిషత్ కంటే ముందే సర్పంచ్‌ల ఎన్నికలు నిర్వహించబోతున్నారని వస్తున్న వార్తల క్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామాలపై దృష్టిని కేంద్రీకరించింది.

పట్టు తప్పుతున్న 'ప్రైవేటు వైద్యం'

- అర్హతను మించి ఆర్ఎంపీలు, పీఎంపీల వైద్యం
- ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లలో నిర్లక్ష్యంపై ఆరోపణలు
- ప్రాణాలు కోల్పోతున్న సామాన్యులు
- వీధిన పడుతున్న కుటుంబాలు



గద్వాల జిల్లా కేంద్రంలో ప్రైవేటు ఆసుపత్రిని సీజ్ చేస్తున్న జిల్లాస్థాయి వైద్యాధికారులు (ఫైల్)

గ్రామీణ ప్రాంతాల్లో ప్రథమ చికిత్స చేసే కొందరు ఆర్ఎంపీలు, పీఎంపీల నిర్లక్ష్యంతో ప్రైవేటు వైద్యం పట్టుతప్పుతోంది. అభాగ్యులు ప్రాణాలు కోల్పోతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీల కేంద్రాలను అధికారులు తరుచూ తనిఖీలు చేస్తున్నా పరిస్థితి మారడం లేదన్న విమర్శలున్నాయి. ఇటీవల వైద్యం వికటించి ఉమ్మడి జిల్లాలో చాలా చోట్ల ప్రాణాలు కోల్పోయారు. అక్కడక్కడ అధికారులు చికిత్స కేంద్రాలను సీజ్ చేస్తున్నా వారిలో మార్పు రావడం లేదు.

6 - అయిజ టౌన్, ఆంధ్రజ్యోతి

నాణ్యమైన విద్యుత్ అందించేందుకే నూతన సబ్ స్టేషన్లు

- ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నాం
- పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



దావాజీపల్లిలో సబ్ స్టేషన్ నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి జూపల్లి కృష్ణారావు, చిత్రంలో మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, కలెక్టర్ ఆదర్శ్‌సురభి

పాన్‌గల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలంలోని దావాజీపల్లిలో 33/11 కేవీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సబ్‌స్టేషన్లు అందుబాటులోకి వస్తే నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందని తెలిపారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం రైతులు అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, డీడీ కట్టిన 60 రోజుల్లో వ్యవసాయ బోరుకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాల్సిన బాధ్యత ఆ శాఖ అధికారులపై ఉంటుందని తెలిపారు. దావాజీపల్లి నుంచి పుల్గర్‌చర్ల వరకు డబుల్ రోడ్ నిర్మాణానికి రూ.37 కోట్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో తెగిన కుంటలు, కాలువలపై నివేదిక సమర్పించాల్సిం దిగా వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభికి సూచించారు. అనంతరం కేతేపల్లిలో బీసీ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. మంత్రి వెంట డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్‌సాగర్, ఆయా శాఖల అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

సెప్టెంబరు 2న ఓటర్ల తుది జాబితా

-నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఓటర్ల తుది జాబితాను సెప్టెంబరు 2న విడుదల చేయనున్నట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్థానిక సంస్థల ఎన్నికల ఓటరు జాబితా షెడ్యూల్ అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నాగర్‌కర్నూల్ జిల్లాలో 460గ్రామ పంచాయతీల వారిగా ఫొటోలతో కూడిన ఓటరు జాబితాను సిద్ధం చేసి 4,102వార్డుల వారీగా గురువారం ప్రచురించామని తెలిపారు. తుది ఓటరు జాబితా తయారీతో పాటు అవసరమైన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సహకారం అందించాలని కోరారు. ఈ నెల 29న జిల్లా స్థాయి, 30న మండల స్థాయి రాజకీయ పార్టీ నాయకులతో ఎంపీడీవోల భేటీ, ఈనెల 28 నుంచి 30వరకు అభ్యంతరాల స్వీకరణ, సెప్టెంబరు 2న తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

హత్య కేసును ఛేదించిన పోలీసులు

- అరుగురు నిందితుల అరెస్టు
- నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్

6



హత్య కేసులో నిందితులను మీడియా ముందు హాజరు పర్చిన డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్, సీఐ మహేశ్

రైతులను మోసం చేస్తే సహించేది లేదు



మాట్లాడుతున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ఫర్టిలైజర్ డీలర్లు రైతులను మోసం చేస్తే సహించే ప్రసక్తే లేదని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి హెచ్చరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డివిజన్ స్థాయి వ్యవసాయ అధికారులు, ఫర్టిలైజర్ డీలర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు రైతులకు యూరియాతో పాటు గుళికలు అంటగట్టి అధిక డబ్బులు వసూలు చేస్తున్నారని తెలుస్తోంది. అలా చేస్తే ఎంతటి వారైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. కొంతమంది ఫర్టిలైజర్ షాపుల యాజమానులు దుకాణాల వద్ద స్టాక్ వివరాలు ఉంచడం లేదన్నారు. డీలర్లు అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఏడీ కిరణ్‌కుమార్, తహసీల్దార్ ఇబ్రహీం, సీఐ నాగార్జున, ఫర్టిలైజర్ డీలర్లు పాల్గొన్నారు.



నీటి ప్రవాహంలో తాడు సాయంతో వాగు నుంచి బయటికి వస్తున్న జంపన్న

నల్లమలలో తప్పిపోయిన ఇద్దరూ క్షేమం

- అర్ధరాత్రి అడవిలోకి వెళ్లి వారిని రక్షించిన లింగాల పోలీసులు

అచ్చంపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వనమూలికల కోసం నల్లమలలో అడవిలోకి వెళ్లి తప్పిపోయిన ఇరువురు క్షేమంగా ఇంటికి చేరారు. పోలీసులు, అప్పాపల్లి గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి గ్రామానికి చెందిన జంపన్న, వెంకటస్వామి గురువారం ఉదయం వనమూలికల కోసం అప్పాపల్లి సమీపంలోని నల్లమల అడవిలోకి వెళ్లారు. అడవిలోకి వెళ్లిన వీరు బయటకు వచ్చే సమయానికి చీకటి పడటంతో దారి తప్పారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులు లింగాల ఎస్ఐ వెంకటేష్‌గౌడుకు సమాచారం ఇవ్వడంతో ఆయన వారికి ఫోన్‌చేసి మీరు ధైర్యంగా ఉండాలని, ఫోన్ సిగ్నల్ అందుతున్న ప్రాంతం నుంచి ఎక్కడికి వెళ్లవద్దని సూచించారు. గురువారం అర్ధరాత్రి ఎస్ఐ తన సిబ్బంది, అప్పాపల్లి యువకులను తీసుకొని ఫోన్ లోకేషన్ ద్వారా అడవిలో వెతకడానికి వెళ్లారు. ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణ వాగు అవతల 20 మీటర్ల దూరంలో చిక్కుకొని ఉన్నవారిని తాడు సాయంతో సురక్షిత ప్రాంతానికి తీసుకువచ్చారు. ఎస్సైతో పాటు గ్రామస్థులు మొగిలి నిరంజన్, చందర్, సంతోష్, రాజు, తులసిరాం తదితరులు ఉన్నారు.

కృష్ణానదిపై 'అలివి' వేటగాళ్ల కన్ను

- ఏపీ నుంచి మత్స్యకారుల రాక
- పట్టు (స్థలం) కోసం వేలం పాట

6



కూతురిని విదేశానికి పంపి.. తండ్రి అనంతలోకాలకు

7

చెరువులో పడి వ్యక్తి మృతి

6



సీఎం ప్రారంభించనున్న ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న పాలమూరు ఎస్పీ జానకి

సీఎం ప్రారంభించే ఇళ్ల పరిశీలన

మూసాపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వచ్చే నెల 3న మూసాపేట మండల కేంద్రంలో ప్రారంభించనున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఎస్పీ డి.జానకి శుక్రవారం పరిశీలించారు. సీఎం ప్రారంభోత్సవానికి అనుకూలంగా, సరైన రోడ్డు మార్గం ఉండే ఉప్పరిపల్లి ప్రమీలా, షాకిరాబేగం ఇళ్లను పరిశీలించి ఎంపిక చేశారు. భద్రతపై పర్యవేక్షించారు. ఎస్పీ వెంట సీఐ రామకృష్ణ, ఎస్ఐ ముల్కలపల్లి వేణు, పంచాయతీ కార్యదర్శి మహేందర్ ఉన్నారు.

క్రీడాకారులకు స్ఫూర్తి ప్రదాత ధ్యాన్‌చంద్

- అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ
- ఘనంగా ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలు



ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాల వేస్తున్న అదనపు కలెక్టర్

గద్వాల అర్బన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : హాకీ క్రీడలో ప్రపంచ అత్యుత్తమ క్రీడాకారుల్లో ఒకరిగా నిలిచిన ధ్యాన్‌చంద్ నేటితరం క్రీడాకారులకు స్ఫూర్తి ప్రదాత అని గద్వాల అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం గద్వాల పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో ధ్యాన్‌చంద్ విగ్రహానికి డీవైఎస్‌వో జితేందర్‌తో కలిసి పూలమాల వేసి నివాళులర్పిం చారు. అనంతరం ప్రధాన రహదారుల మీదుగా క్రీడా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడారు. ధ్యాన్‌చంద్ క్రీడారంగానికి చేసిన సేవలకు గుర్తింపుగానే భారత ప్రభుత్వం ఆయన జయంతిని జాతీయ క్రీడాదినోత్సవంగా నిర్వహిస్తుండటం క్రీడాలోకానికి గర్వ కారణమన్నారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ టోర్నీ

- ప్రారంభించనున్న క్రీడాశాఖ రాష్ట్ర సలహాదారు జితేందర్‌రెడ్డి
- 33 జిల్లాల నుంచి పాల్గొనున్న 1,056 మంది క్రీడాకారులు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఒలింపిక్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎస్పీ వెంకటేశ్, అథ్లెటిక్స్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి క్రీడా సంబురానికి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం వేదిక కానుంది. శనివారం, ఆదివారాల్లో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జి.రాజేంద్రప్రసాద్ స్మారక 11వ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నారు. అండర్-14, 16, 18, 20 విభాగాల్లో జూనియర్ బాల, బాలికలకు నగరంలోని పాలమూరు యూనివర్సిటీ సింథటిక్ ట్రాక్‌లో పోటీలు ఏర్పాటు చేయనున్నారు. రెండో రోజుల పాటు నగర ప్రజలకు కనువిందు చేయనున్నారు. ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎస్‌పీ వెంకటేశ్, జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర ఆధ్వర్యంలో టోర్నీ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. బాలికలు, యువతులకు తెలంగాణ మహిళా శిశు సంక్షేమ వసతి గృహం, బాలురు, పురుషులకు శిల్పారామంలో బస కల్పిస్తున్నారు. పీయూలో భోజన వసతి ఉంటుంది.

పాల్గొననున్న 33 జిల్లా జట్లు

పోటీల్లో రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 1,056 మంది క్రీడాకారులు తలపడనున్నారు. పోటీలను శనివారం ఉదయం 9:30 గంటలకు రాష్ట్ర క్రీడా శాఖ సలహాదారులు ఏపీ జితేందర్‌రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివాసేనరెడ్డి ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించనున్నారు. రాష్ట్ర, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు హాజరుకానున్నారు.

ఏర్పాట్లు పూర్తి..

జి. రాజేంద్రప్రసాద్ స్మారక 11వ తెలంగాణ రాష్ట్ర స్థాయి బాల, బాలికల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. పాలమూరు యూనివర్సిటీలోని సింథటిక్ ట్రాక్‌పై పోటీలు జరుగనున్నాయి. 33 జిల్లాల నుంచి 1,056 మంది క్రీడాకారులు, 50 మంది సాంకేతిక నిపుణులు హాజరుకానున్నారు. వారికి బస, భోజన వసతికి కల్పిస్తున్నాం. అందరి సహకరంతో టోర్నీని విజయవంతంగా నిర్వహిస్తాం.

- శరత్‌చంద్ర, అథ్లెటిక్స్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

పొద్దస్తమానం పడిగాపులు

- యూరియా కోసం రైతులకు తప్పని కష్టాలు
- భూత్పూర్‌లో ధర్నా



వంగూరులో యూరియా కోసం బారులు తీరిన రైతులు 6

ఐశ్వర్య గణపతికి ప్రత్యేక పూజలు



ఆవంచలో వెలసిన ఐశ్వర్య గణపతి

తిమ్మాజిపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఆవంచలో వెలసిన ఐశ్వర్య గణపతి భారతదేశంలోని అతి పెద్ద వినాయకుడిగా పూజలందుకుంటున్నారు. ఐశ్వర్య గణపతి 1175 సంవత్సరంలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన పశ్చిమ చాళుక్యుల వంశస్తుడైన తైలంపుడు అనే రాజు తన అన్నతో గొడవపడి తండ్రి విక్రమాదిత్యునికి తన రాజ్యాన్ని వదిలి ఆవంచ గ్రామానికి చేరుకొని రాజధానిగా చేసుకొని పరిపాలన సాగించాడు. 30 అడుగుల ఏకశిలపై వినాయకుడి ప్రతిమను చెక్కించినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఆవంచ గ్రామ నివాసి మాజీ మంత్రి లక్ష్మారెడ్డి తమ గ్రామంలో వెలసిన వినాయకుడిని వెలుగులోకి తేవాలని ప్రతీ వినాయక చవితికి పూజలు జరిపిస్తున్నారు. ఆలయ నిర్మాణం విషయమై పలు సేవా ట్రస్టులకు వివరించగా మహారాష్ట్రలోని మ హాలక్ష్మీ సేవా ట్రస్టు ఉత్తరాదేవి చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు విషయం తెలుసుకొని పెద్ద ఎత్తున ఐశ్వర్య గణపతికి పూజలు, హోమాలు నిర్వహించి ప్రాణ ప్రతిష్ఠ చేశారు. వినాయక చవితి పురస్కరించుకొని ఐశ్వర్య గణపతిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు వస్తుండటం విశేషం.

కూలిన మట్టిమిద్దె

- వృద్ధురాలికి గాయాలు

6

ఉధృతంగా ప్రవహిస్తున్న దుందుభీ

- సిర్సవాడ నుంచి స్తంభించిన రాకపోకలు

ఉధృతంగా ప్రవహిస్తున్న దుందుభీ

» సిర్సవాడ నుంచి స్తంభించిన రాకపోకలు



సిర్సవాడ వద్ద డిండి వైపు ఉధృతంగా ప్రవహిస్తున్న దుందుభీ నది

తాడూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లాలోని దుందుభీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. గత 20 రోజుల నుంచి వరద ప్రవాహం తగ్గకపోవడంతో సిర్సవాడ నుంచి కల్వకుర్తి, ఊర్కొండ, మిడ్జిల్ మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు 60 కిలో మీటర్లు చుట్టూతిరిగి వెళ్లాల్సి వస్తోంది. ప్రధానంగా నది అవతలి వైపున పంటలు సాగు చేసిన రైతులు ఇబ్బంది పడుతున్నారు. పొలాలకు వెళ్లలేకపోవడంతో పంటల పరిస్థితి ఎలా ఉందోనని ఆందోళన చెందుతున్నారు.

'కోయిల్‌సాగర్'కు పెరిగిన వరద

» ఒక గేటు ద్వారా నీటి విడుదల

దేవరకద్ర, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లాలోని కోయిల్‌సాగర్ ప్రాజెక్టుకు వరద ఉధృతి బాగా పెరిగింది. ప్రాజెక్టుకు అంకిళ్ల, కోయిల్‌కొండ పెద్దవాగుల నుంచి ప్రాజెక్టుకు భారీగా వరద వచ్చి చేరుతోంది. దీంతో శుక్రవారం ఒక గేటును పీటు ఎత్తి తెరిచి 1500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 32.5 అడుగులు కాగా, మంగళవారం నాటికి 32.2 అడుగులకు చేరింది.

నిరంతరాయంగా జల విద్యుత్ ఉత్పత్తి

ఆత్మకూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ఎగువ నుంచి ఆశించిన మేర వరద వస్తుండటంతో జూరాల ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాలలో నిరంతరాయంగా విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. ఎగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో ఆరు యూనిట్ల ద్వారా 3.759 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 258.622 మిలియన్ యూనిట్లను విద్యుత్ ఉత్పత్తి చేసినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. దిగువ కేంద్రంలో 4 యూనిట్ల ద్వారా 3.57 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోందని చెప్పారు. ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 289.916 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అయినట్లు తెలిపారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా

మోస్తరు వర్షం

మహబూబ్‌నగర్/ వనపర్తి/ నారాయణపేట/ నాగర్‌కర్నూల్ టౌన్/ గద్వాల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా గురువారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది. శుక్రవారం కూడా అక్కడక్కడ జల్లులు పడ్డాయి.

● మహబూబ్‌నగర్ జిల్లాలోని మిడ్జిల్ మండలంలో అత్యధికంగా 60.1 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జడ్చర్లలో 47.9, మహబూబ్‌నగర్ అర్బన్‌లో 20.9, భూత్పూర్‌లో 15 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది.

● జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లిలో 56.4 మిల్లీమీటర్ల వర్షం కురవగా మానవపాడులో 47, అలంపూర్‌లో 36.3, రాజోలి లో 27, ఇటిక్యాలలో 25, గట్టులో 24.8, గద్వాలలో 24, ధరూర్‌లో 17, మల్దకల్‌లో 17.6, అయిజలో 16.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

● నాగర్‌కర్నూల్ జిల్లా జటప్రోలులో 36.5 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ఉర్కొండలో 30.3, పెద్దకొత్తపల్లిలో 30.3, కొల్లాపూర్ 25.5, కల్వకుర్తిలో 20.0, వెల్దండలో 17.3, పదరలో 13.5, తిమ్మాజిపేటలో 10.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

● వనపర్తి జిల్లా చిన్నంబావి మండలంలో 33.8 మి.మీ వర్షపాతం నమోదైంది. ఆత్మకూరు 9.2, వీపనగండ్ల 7.2, పెద్దమందడి 8.2, ఘణపూర్, పెబ్బేరు, రేవల్లిలో 4.2 మి. మీ వర్షపాతం నమోదైంది.

● నారాయణపేట జిల్లా కేంద్ర మండలంలో 17.8 మి.మీ. వర్షపాతం నమోదు కాగా ఊట్కూర్ మండలంలో 14.0, నర్వ 13.5, కోస్గి 13.2, మక్తల్ మండలంలో 11.3 మి.మీ. వర్షపాతం నమోదైంది.

కూలిన మట్టిమిద్దె

» వృద్ధురాలికి గాయాలు



కూలిన ఇంటి పైకప్పు



గాయపడిన కొండలమ్మ

వడ్డేపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : మట్టిమిద్దె కూలి ఓ వృద్ధురాలు గాయపడింది. జోగుళాంబ గద్వాల జిల్లా, వడ్డేపల్లి మండల పరిధిలోని జూలకల్లు గ్రామంలో శుక్రవారం ఈ సంఘటన జరిగింది. దాదాపు 20 రోజులుగా కురుస్తున్న వర్షానికి కొండలమ్మ అనే వృద్ధురాలికి చెందిన మట్టిమిద్దె నానిపోయి, శుక్రవారం పైకప్పు కూలిపోయింది. ఇంట్లో ఉన్న కొండలమ్మపై మట్టిపడటంతో తీవ్రంగా గాయపడింది. స్థానికులు ఆమెను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమెకు కాలు విరిగిందని అక్కడి వైద్యులు తెలిపారు. వృద్ధురాలికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమార్తె ఉండగా, పెద్ద కుమారుడు గతంలో చనిపోయాడు. రెండో కుమారుడు మానసిక వికలాంగుడు, కుమార్తెకు మాటలు రావని గ్రామస్థులు తెలిపారు. ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : కులస్థుడి దశదిన కర్మకు వెళ్లిన వ్యక్తి ప్రమాదశాత్తు చెరువులో పడి మునిగిపోయాడు. మరుసటి రోజు అతడి మృతదేహం లభ్యం అయ్యింది. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా, పెద్దకొత్తపల్లి మండలం గంట్రావుపల్లి గ్రామంలో గురువారం జరిగింది. సంఘటనకు సంబంధించి గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఈశ్వరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు అతడి దశ దిన కర్మ కార్యక్రమాన్ని గురువారం గ్రామ శివారులోని పెద్ద చెరువు వద్ద నిర్వహించారు. ఆ కార్యక్రమానికి బోయ కుర్మయ్య (42) కూడా వెళ్లాడు. కార్యక్రమం కొనసాగుతుండగా, కుర్మయ్య చెరువులో ఈదుకుంటూ ముందుకెళ్లాడు. వెనక్కి తిరిగి రాలేక నీటిలో మునిగిపోయాడు. కుటుంబ సభ్యులు మత్స్యకారుల సాయంతో చెరువులో గాలించగా శుక్రవారం మధ్యాహ్నం అతడి మృతదేహం లభ్యమైంది. కుర్మయ్యకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ సంఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పట్టు తప్పుతున్న ప్రైవేటు వైద్యం



బుధవారం గట్టు మండలం, ఆలూరులో ఆర్‌ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేసిన అధికారులు

» అర్హతను మించి ఆర్‌ఎంపీలు, పీఎంపీల వైద్యం

» ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లలో నిర్లక్ష్యంపై ఆరోపణలు

» ప్రాణాలు కోల్పోతున్న సామాన్యులు

» వీధిన పడుతున్న కుటుంబాలు

అయిజ టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 'ప్రైవేట్ వైద్యం' పట్టుతప్పుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నా, చితకా అనారోగ్యాలకు ప్రథమ చికిత్స చేసే ఆర్‌ఎంపీలు, పీఎంపీలు, పట్టణ ప్రాంతాల్లో నర్సింగ్‌హోమ్‌లలో వైద్యుల నిర్లక్ష్య వైఖరితో అభాగ్యులు ప్రాణాలు కోల్పోతున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా, గట్టు మండలంలో గత బుధవారం ఓ ఆర్‌ఎంపీ వైద్యుడు ఇచ్చిన హైపవర్ ఇంజక్షన్‌తో అయిదేళ్ల చిన్నారి మృతి చెందింది. ఇటీవల జిల్లా కేంద్రంలోని సుంకులమ్మ మెట్టు సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఓ ఆర్‌ఎంపీ, అయిజ మండలంలోని వెంకటాపురంలోని మరో ఆర్‌ఎంపీ క్లినిక్‌లను జిల్లా వైద్యాధికారులు సీజ్ చేశారు.

సంబంధిత అధికారులు తరుచూ తనిఖీలు నిర్వహించి, చర్యలు తీసుకుంటున్నా పరిస్థితి మారడం లేదన్న విమర్శలున్నాయి.



గతంలో అయిజలోని ప్రైవేటు డయాగ్నోస్టిక్ కేంద్రంలో రికార్డులు తనఖీ చేస్తున్న అధికారులు (ఫైల్)

గతంలో జరిగిన సంఘటనలు కొన్ని...

● గతేడాది నవంబర్‌లో జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ పట్టణంలోని బుడగజంగాల కాలనీకి చెందిన కవిత (28) అనే మహిళ శ్వాస తీసుకునేందుకు ఇబ్బందిగా ఉండటంతో కుటుంబ సభ్యులు గద్వాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆమెకు ఆపరేషన్ కోసం ఇచ్చిన వైద్యులు ఇచ్చిన మత్తు ఇంజక్షన్ వికటించి కోమాలోకి వెళ్లింది. పరిస్థితి విషమించి మృతి చెందింది. దీంతో ఆ ఆసుపత్రిని అధికారులు సీజ్ చేశారు.

● గత ఏడాది డిసెంబర్‌లో నాగర్‌కర్నూలు జిల్లా, తెల్కపల్లి మండలానికి చెందిన 3 నెలల గర్భిణి రాములమ్మ (26)కు ఆమెకు తిమ్మిర్లు రావటంతో ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లింది. అక్కడి వైద్యులు ఆమెకు చికిత్స చేశారు. సమస్య తీవ్రంగా ఉండటంతో కొల్లాపూర్‌లోని మరో ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ మృతి చెందింది. ఆమె మృతికి ఆసుపత్రి నిర్వాహకులే కారణమంటూ బాధిత కుటుంబ సభ్యులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.

● ఈ ఏడాది మార్చిలో కొత్తకోటకు చెందిన విద్యాసాగర్ కండరాల సమస్యతో పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లగా, ఇంజక్షన్ చేశారు. అది వికటించడంతో మహబూబ్‌నగర్‌లోని మరో ఆసుపత్రిలో రూ.4 లక్షలు ఖర్చుచేసి ఆపరేషన్ చేయించుకున్నారు. సంఘటనపై విచారణ చేసిన అధికారులు ఆసుపత్రిపై చర్యలు తీసుకున్నారు.

● ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆత్మకూరులోని ఓ ప్రైవేటు నర్సింగ్‌హోమ్‌లో సిజేరియన్ ఆపరేషన్ కోసం వచ్చిన ఓ మహిళకు సంబంధిత వైద్యులు లేకుండానే మత్తు ఇంజక్షన్ ఇచ్చారు. తల, మొండేన్ని వేరు చేసి మృత శిశువును బయటికి తీశారు. సంఘటనపై సీరియస్ అయిన జిల్లా వైద్యాధికారి ఆస్పత్రిని సీజ్ చేయటంతో పాటూ, క్రిమినల్ కేసు నమోదు చేశారు.

● ఈ ఏడాది మే నెలలో జడ్చర్ల మండలంలోని ఓ ఆర్‌ఎంపీ అనుమతి లేకుండా రూ.1.50 లక్షల విలువైన మందులను క్లినిక్‌లో నిల్వ ఉంచుకున్నాడు. దీంతోపాటు అర్హత లేకున్నా వైద్యం చేస్తుండటంతో అధికారులు క్లినిక్‌ను సీజ్ చేశారు. అదే నెలలో గండీడ్ మండలంలో ఓ ఆర్‌ఎంపీ చేసిన వైద్యం వికటించి ఓ మహిళ మృతి చెందింది. దీంతో వైద్యాధికారులు ఆ ప్రథమ చికిత్స కేంద్రాన్ని సీజ్ చేశారు.

● ఇదే ఏడాది జూన్‌లో కొల్లాపూర్ మండలానికి చెందిన గర్భిణి వనజ (26)కు నాగర్‌కర్నూల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం వికటించి మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రి ముందు ఆందోళన చేశారు.

● ధరూరు మండలానికి చెందిన మూడు నెలల చిన్నారికి జ్వరం రావడంతో తల్లిదండ్రులు గద్వాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. రెండు రోజుల చికిత్స అనంతరం చిన్నారి మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులు ఆసుపత్రి ముందు ఆందోళన చేపట్టారు.

● జూలైలో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నారాయణపేటకు చెందిన ఓ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యం వల్లే ఆమె మృతి చెందిందని పేర్కొంటూ బాధిత కటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు



గ్రామాలు, పట్టణాల్లో ఎవరైనా నిబంధనలను అతిక్రమించి వైద్య చేసినట్లు విచారణలో తెలితే కఠిన చర్యలు ఉంటాయి. జోగుళాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా నాలుగు వందలకు పైబడి ఆర్‌ఎంపీ, పీఎంపీలు ఉన్నారు. వారి స్థాయికి మించి చికిత్సలు, సర్జరీలు చేస్తే చర్యలు తీసుకుంటాం. అలాగే నర్సింగ్‌హోమ్ నిర్వాహకులు కూడా నిబంధనలను అతిక్రమించి వైద్యం చేయొద్దు.

- సిద్ధప్ప, డీఎంహెచ్‌వో, గద్వాల

హత్య కేసును ఛేదించిన పోలీసులు

» ఆరుగురు నిందితుల అరెస్టు

» నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లాలో జరిగిన హత్య కేసును పోలీసు ఛేదించారు. ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. పెద్దకొత్తపల్లి పోలీస్‌స్టేషన్లో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను హాజరుపరిచి, కేసు వివరాలను వెల్లడించారు. కోడేరు మండలంలోని మైలారానికి చెందిన అనుముల రంగస్వామి (45) అదృశ్యం అయినట్లు అతడి భార్య అరుణ ఈ నెల 4న కోడేరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు చేపట్టిన విచారణలో వాస్తవాలు వెల్లడయ్యాయి. రంగస్వామికి 4 నెలల క్రితం ఏదుల పులందర్‌గౌడ్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. తనకు తెలిసిన ఓ స్వామీజీ గుప్త నిధులను వెలికితీస్తాడని రంగస్వామి అతడికి చెప్పాడు. అతడి మాటలను నమ్మిన పులందర్‌గౌడ్ అతడికి రూ.5 లక్షలు ఇచ్చాడు. ఆ తర్వాత మరో రూ. 5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఇవ్వకపోతే స్వామీజీ కన్ను ఎర్ర చేస్తాడని బెదిరించాడు. దీంతో రంగస్వామిని చంపేయాలని పులందర్‌గౌడ్ నిర్ణయించుకున్నాడు. తన స్నేహితులు రమేశ్, శివ, కర్నాటి సుధాకర్, జక్కుల తిరుపతయ్య, భాస్కర్‌గౌడ్‌లతో కలిసి పథకం రూపొందించాడు. డబ్బు ఇస్తామని నమ్మించి గత నెల 29న అతడిని జడ్చర్ల నుంచి మహబూబ్‌నగర్‌కు తీసుకెళ్లారు. అక్కడ తన తమ్ముడు సలేశ్వర్‌గౌడ్ ఇంట్లో చికెన్‌లో అల్ప్రాజోలం కలిపి తినిపించడంతో రంగస్వామి స్పృహ కోల్పోయాడు. ఆ తర్వాత అతడిని తుఫాన్ వాహనంలో ఎక్కించి, భాస్కర్‌గౌడ్ పని చేస్తున్న మైలారం గ్రామంలోని మామిడి తోటకు తీసుకెళ్లారు. అక్కడ ఓ గుంత తవ్వి రంగస్వామిని అందులో పడేశారు. అప్పటికీ అతడు మూలుగుతుండటంతో శివ గడ్డపారతో అతడి తలపై బాది చంపేశారు. ఆ తర్వాత 5 ప్యాకెట్ల ఉప్పు చల్లి గుంతను పూడ్చేశారు. అక్కడే మద్యం తాగి వెళ్లిపోయారు. సంఘటనపై మృతుడి భార్య అరుణ పులందర్‌గౌడ్‌పై అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు అతడి కాల్‌డాటాను పరిశీలించారు. అదుపులోకి తీసుకొని విచారించగా హత్య చేసినట్లు అంగీకరించాడు. ప్రాథమిక దర్యాప్తు తర్వాత కేసు తీవ్రత దృష్ట్యా, కొల్లాపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మహేశ్ బాధ్యతలు స్వీకరించారు.

నాగర్‌కర్నూల్ ఎస్పీ, డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్ పర్యవేక్షణలో విచారణ చేపట్టి 6 గురు నిందితులను అరెస్టు చేశారు. రమేశ్ అనే వ్యక్తి పరారీలో ఉన్నాడు. వారి నుంచి 6 మొబైల్ ఫోన్లు, ఒక తుఫాన్ వాహనం, రెండు గడ్డపారలను స్వాధీనం చేసుకున్నాడు. కేసు దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని, నిందితులను త్వరలోనే న్యాయం స్థానం ముందు హాజరుపరుస్తామని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో కొల్లాపూర్ సీఐ మహేశ్, పెద్దకొత్తపల్లి, కోడేరు ఎస్ఐలు వి.సతీశ్, జగదీశ్వర్ పాల్గొన్నారు.

అంగీకార పత్రాలపై సంతకాలు

- సేకరిస్తున్న అధికారులు



ఖిల్లాఘణపురంలో రిజర్వాయర్ భూసేకరణ అంగీకార పత్రాలపై రైతులతో సంతకాలు చేయిస్తున్న అధికారులు

ఖిల్లాఘణపురం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపురం మండలంలోని గణపసముద్రం చెరువును రిజర్వాయర్‌గా మారుస్తున్నారు. ఈ నేపథ్యంలో ముంపునకు గురవుతున్న భూముల రైతుల నుంచి అధికారులు సంతకాలు సేకరిస్తున్నారు. అయితే రైతులు ప్రారంభంలో ఆందోళన వ్యక్తం చేసినా, ప్రస్తుతం అభ్యంతరాలు తెలుపకుండా అంగీకార పత్రాలు అందజేస్తున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం భూ సేకరణ అధికారులు డిప్యూటీ తహసీల్దార్లు శివలింగం, హాసిఫ్ ఆధ్వర్యంలో అంగీకారపత్రాలపై రైతులతో సంతకాలు సేకరించారు. గణపసముద్రం రిజర్వాయర్ కింద 388.03 ఎకరాల భూమి ముంపునకు గురవుతోంది. అందుకోసం గత ప్రభుత్వ హయాంలో మొదటి విడత గెజిట్ విడుదల చేశారు. సదరు భూమికి 1,022 మంది రైతులు పట్టాదారులుగా ఉన్నారు. వారికి పరిహారం అందించేందుకు భూ సేకరణ అధికారులు ఈ నెల 17 నుంచి రైతుల సంతకాలు తీసుకుంటున్నారు. ఈ ప్రక్రియ 30 వ తేదీ వరకు కొనసాగనున్నది. ముంపు రైతులకు ప్రభుత్వం ఎకరానికి రూ.12.60 లక్షల రూపాయలు చెల్లిస్తోంది. అందుకు అంగీకరించి ఇప్పటివరకు 931 మంది రైతులు భూపత్రాలు అందించి, సంతకాలు చేసినట్లు భూ సేకరణ అధికారులు చెప్తున్నారు. మిగిలిన 91 మందిలో కొందరు అందుబాటులో లేరని, మిగిలిన వారు పత్రాలు సమర్పించలేదని తెలిపారు. రిజర్వాయర్‌లో ముంపునకు గురికానున్న మరో 197 ఎకరాల భూమికి సర్వే పూర్తి చేయడంతో పాటు రెండో విడత భూ సేకరణకు సంబంధించి త్వరలో గెజిట్ విడుదల కానున్నది.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



నవీన్ (ఫైల్)

వీపనగండ్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. వనపర్తి జిల్లా, వీపనగండ్ల మండల కేంద్రానికి చెందిన మీసాల రాముడు, జయమ్మ దంపతుల చిన్న కుమారుడు మీసాల నవీన్ (22) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో ఎలక్ట్రిషన్‌గా పని చేస్తున్నాడు. అతడు మూడు రోజుల క్రితం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు అతడిని నిమ్స్ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

కృష్ణానదిపై 'అలివి' వేటగాళ్ల కన్ను

» ఏపీ నుంచి మత్స్యకారుల రాక

» పట్టు (స్థలం) కోసం వేలం పాట



మరబోట్లకు ఎత్తుతున్న అలివి వలలు (ఫైల్)

పెంట్లవెల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : పర వళ్లు తొక్కుతూ ప్రవహిస్తున్న కృష్ణానదిపై అలివి వలల వేటగాళ్ల కన్ను పడింది. నాగర్‌కర్నూల్‌జిల్లా, పెంట్లవెల్లి మండల పరిధిలోని మల్లేశ్వరం, మంచాలకట్ట, జటప్రోలు, కొల్లాపూర్ మండలంలోని సోమశిల, అమరగిరి, తదితర ప్రాంతాల్లో అలివి వలలతో చేపలవేట జోరుగా సాగుతుంది. నదిలో చేపలను పట్టేందుకు స్థానిక మత్స్యకారులు (పట్టు) స్థలాలను కేటాయించుకొని స్థావరాలు ఏర్పాటు చేసుకొని వేలం వేస్తారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని తూర్పు గోదావరి, కొవ్వూరు, రాజమండ్రి తదితర ప్రాంతాలకు చెందిన దళారులు ఆ పట్టులను వేలం పాడుకుంటారు. ఒక్కో పట్టు ధర రూ. 3 లక్షల నుంచి రూ. 8 లక్షల వరకు ధర పలుకుతోంది. ప్రస్తుతం వేలం పాటలు కొనసాగుతున్నాయి. అయితే అలివి వలలతో చేపల వేటపై ప్రభుత్వం నిషేధం విధించింది. అయినా మత్స్యశాఖ అధికారులు ఈ వ్యవహారాన్ని పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

పద్మాలయ ఆచార్యకు

కీర్తి పురస్కారం



నాగర్‌కర్నూల్ టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ హరికథ భాగవతార్ పద్మాలయ ఆచార్యకు అరుదైన గౌరవం దక్కింది. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ అందిస్తున్న 'సీతారత్నం - డాక్టర్ మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి కీర్తి పురస్కారం - 2023'కి ఆమె ఎంపికయ్యారు. సెప్టెంబరు 3న హైదరాబాదు, తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్‌టీ ఆర్ కళామందిరంలో నిర్వహించనున్న ప్రదానోత్సవంలో ఆమె ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. పద్మాలయ ఆచార్య తాడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయనిగా పని చేస్తున్నారు.



అమరచింతలో యూరియా కోసం తెల్లవారుజామునే క్యూలైన్‌లో కూర్చున్న రైతులు



ఆత్మకూరు సహకార సంఘం కార్యాలయం ముందు యూరియా కోసం ఎదురు చూస్తున్న రైతులు



ఉప్పునుంతలలో యూరియా కోసం క్యూలైన్లో నిలుచున్న రైతులు

పొద్దస్తమానం పడిగాపులు



ఆత్మకూరు సహకార సంఘం కార్యాలయం ముందు చెప్పులను వరుస క్రమంలో పెట్టిన రైతులు

» యూరియా కోసం తప్పని కష్టాలు

» భూత్పూర్‌లో రైతుల ధర్నా

భూత్పూర్/ ఆత్మకూరు/ అమరచింత/ ఉప్పునుంతల/ వంగూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : పొలం పనుల్లో నిమగ్నం కావల్సిన సమయంలో రైతులు సహకార సంఘం కార్యాలయాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా గత 20 రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది.

● మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మండల కేంద్రంలో యూరియా కోసం శుక్రవారం రైతులు రా స్తారోకో చేపట్టారు. దీంతో శ్రీశైలం - పాలమూరు జాతీయ రహదారిపై రెండు గంటల పాటు రాస్తారోకో కొనసాగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో పోలీసులు, వ్యవసాయశాఖ అధికారులు రైతులకు నచ్చచెప్పినా ఫలితం లేకపోయింది. దీంతో ఏవో మురళీధర్ అక్కడకు చేరుకొని 2, 3 రోజుల్లో యూ రియా సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకోను విరమించారు.

● వనపర్తి జిల్లా ఆత్మకూరులోని సహకార సంఘం కార్యాలయం ముందు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచే రైతులు వరుస క్రమంగా చెప్పులను ఉంచి యూరియా కోసం ఎదురు చూశారు. సాయంత్రం 4 గంటల సమయంలో 300 బస్తాల యూరియా రావడంతో ఒక్కొక్కరికి 150 మంది రైతులకు పంపిణీ చేశారు. మిగిలిన వారికి టోకెన్లు ఇచ్చి పంపించేశారు.

● అమరచింతలో వర్షాన్ని కూడా లెక్క చేయకుండా తెల్లవారుజామున 4 గంటల నుంచే రైతులు ఆగ్రో రైతు సేవా కేంద్రం వద్దకు చేరుకొని వేచి ఉ న్నారు. 8 గంటల తర్వాత నిర్వాహకులు యూరియా పంపిణీ చేశారు.



భూత్పూర్‌లో రాస్తారోకో చేస్తున్న రైతులు

● నాగర్‌కర్నూల్ జిల్లా, ఉప్పునుంతల మండలం కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం ముందు ఉదయం నుంచే రైతులు బారులు తీరారు. ఒక్కో రైతుకు ఒక బస్తా యూరియా మాత్రమే ఇవ్వడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు.

● వంగూరు మండల కేంద్రంలోని ఆగ్రోసేవ కేంద్రం వద్ద రైతులు ఉదయం నుంచే క్యూలో నిలుచున్నారు. ఒకటి, రెండు బస్తులు మాత్రమే ఇవ్వడంతో నిరాశకు గురి అయ్యారు.

విఘ్నేశ్వరాయ.. విభిన్న రూపాయ...


పాలమూరు పట్టణంలోని కిషన్ నగర్‌లో ధనుర్ధారిగా గణనాథుడు


గద్వాల పట్టణంలోని రెవెన్యూ కాలనీలో ఈశ్వరుడి రూపంలో వినాయకుడు


ఖిల్లాఘణపురం ముదిరాజ్ కాలనీలో కొలువైన 15 అడుగుల త్రిశూలధారి గణపతి


మహబూబ్‌నగర్ మోనప్పగుట్టలో బాల శివుడిగా భక్తులకు దర్శనమిచ్చిన వినాయకుడు


బాదేపల్లిలో గోల్డెన్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన పూరీ జగన్నాథ సమేత గణపతి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గణేశ్ ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఊరూరా, వాడవాడలా ఏర్పాటు చేసిన మండపాల్లో విఘ్నేశ్వరుడు విభిన్న రూపాల్లో కొలువుదీరి భక్తుల పూజలందుకుంటున్నాడు. ఒక చోట ధనుర్ధారిగా మరో చోట బాల శివుడిగా, ఇంకో చోట రంగనాథ స్వామిగా, పూరీ జగన్నాథ సమేతుడిగా దర్శనమిస్తున్నాడు. 'ఆపరేషన్ సింధూర్'కు ప్రతీకగా అలంకరించిన మండపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

- నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి


నారాయణపేటలోని బాపునగర్‌లో ఎంపీఎం ఫ్రెండ్స్ ప్రతిష్ఠించిన వినాయకుడు



ఆపరేషన్ సింధూర్ స్ఫూర్తితో అచ్చంపేటలో ఏర్పాటు చేసిన మండపంలో సైనికుడిగా గణనాథుడు


మహబూబ్‌నగర్ పట్టణంలో ఏర్పాటు చేసిన 'ఆపరేషన్ సింధూర్' మండపం


పాలమూరు బండ్ల గేరిలో రంగనాథ స్వామిగా దర్శనమిస్తున్న వినాయకుడు


నారాయణపేటలోని పళ్ల వాడలో స్నేహ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దశ కంఠ గణపతి


ఎర్రవల్లి చౌరస్తాలోని సరస్వతీ పాఠశాలలో టేకు ఆకులతో రూపొందించిన గణపతి

క్రైం కార్నర్

త్రుటిలో తప్పిన ప్రాణనష్టం

» డివైడర్ పైకి దూసుకెళ్లిన లారీ


ఎర్రవల్లిచౌరస్తా ప్రధాన కూడలిలో డివైడర్‌పైకి దూసుకొచ్చిన లారీ చుట్టూముట్టిన జనాలు

ఎర్రవల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : బ్రేక్ పని చేయకపోవడంతో కంటైనర్ లారీ అదుపు తప్పి డివైడర్ మీదకు దూసుకెళ్లింది. జోగుళాంబ గద్వాల జిల్లా, ఎర్రవల్లి మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద ఈ సంఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కంటైనర్ లారీ శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి కర్నూలు వైపు వెళ్తుండగా చౌరస్తా వద్ద అదుపుతప్పింది. అదే వేగంతో దూసుకెళ్లి డివైడర్‌పైకి ఎక్కింది. ప్రతీ రోజు అక్కడ చిరువ్యాపారులు కూరగాయలు అమ్ముతూ ఉంటారు. ప్రమాదం జరిగిన సమయానికి వారు రాకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ఈ సంఘటనపై ఇటిక్యాల ఎస్ఐ రవిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా లారీ బ్రేక్‌లు ఫెయిల్ కావడంతో ప్రమాదం జరిగిందని తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో.. ఇద్దరికి జైలు శిక్ష

కల్వకుర్తి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ జి.మాధవరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, ఊర్కొండ మండలంలోని మాదారం గ్రామానికి చెందిన రాజశేఖర్, చారకొండ మండలం తుర్కలపల్లి గ్రామానికి చెందిన గంటి రమేశ్ ఇటీవల డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డారు. పోలీసులు వారిని కల్వకుర్తి కోర్టులో శుక్రవారం ప్రవేశపెట్టారు. ఇద్దరికీ రెండు రోజుల జైలు శిక్ష, వంద రూపాయల జరిమానా విధిస్తూ న్యాయాధికారి కావ్య తీర్పు వెల్లడించినట్లు ఎస్ఐ తెలిపారు.

సారా తయారీదారుల బైండోవర్


తహసీల్దార్ ముందు బైండోవర్ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

కేటీదొడ్డి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : సారా తయారు చేసి, విక్రయిస్తున్న ఐదుగురిని ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. తహసీల్దార్ హరికృష్ణ ముందు బైండోవర్ వారిని బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్ఐలు వెంకటేశ్, శివకృష్ణ మాట్లాడుతూ జోగుళాంబ గద్వాల జిల్లా, కేటీ దొడ్డి మండలంలోని ఉమిత్యాల తండాకు చెందిన ఈరన్న, వాలియానాయక్, లక్ష్మి, తూర్పుతండాకు చెందిన లక్ష్మీబాయ్, వెంకట్ నాయక్‌లు సారా తయారు చేసి అమ్ముతుండగా పట్టుకున్నట్లు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ శివశంకర్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

కూతురిని విదేశానికి పంపి.. తండ్రి అనంతలోకాలకు


విజయ్‌కుమార్ (ఫైల్)

ఎర్రవల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : కన్న కూతురిని విదేశానికి సాగనంపేందుకు వెళ్లిన తండ్రి తిరుగు ప్రయాణంలో అనంతలోకాలకు వెళ్లిన హృదయవిదారక సంఘటన చోటుచేసుకున్నది. జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండల పరిధిలోని ధర్మవరం స్టేజీ దగ్గర 44వ జాతీయ రహదారిపై శుక్రవారం చోటుచేసుకున్నది. ఈ ఘటనలో మరో ఇద్దరికి గాయాలయ్యాయి. కొదండాపురం ఎస్ఐ మురళి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఏపీలోని కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన విజయ్‌కుమార్ (60), మాధవి దంపతులు కలిసి తమ కుమార్తె నందినిని లండన్‌కు పంపేందుకు గురువారం రాత్రి ఎమ్మిగనూర్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు కారులో వెళ్లారు. కూతురిని విమానాశ్రయంలో డ్రాప్ చేసి శుక్రవారం తెల్లవారుజామున తిరుగు ప్రయాణమయ్యారు. 44వ నెంబర్ జాతీయ రహదారిపై గల ధర్మవరం స్టేజి దగ్గర డ్రైవర్ అజాగ్రత్తతో ముందు వెళుతున్న కంటైనర్ లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో కారు రోడ్డు పక్కకు అదుపు పడిపోయింది. విజయ్‌కుమార్ తలకు గాయాలు కాగా ఆయన భార్య మాదవి, డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో కర్నూలు ఆసుపత్రికి తరలించగా అప్పటికే విజయ్‌కుమార్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గాయాలపాలైన ఇద్దరు చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటనపై మృతుడి కుమారుడు చిలుకూరు నయాన్‌కాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

డిజిటల్ కంటెంట్ బాగుంది

» మా నియోజకవర్గంలోనూ అమలు చేస్తాం

» ఎమ్మెల్యే యెన్నంతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


మంత్రి కోమటిరెడ్డికి డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్ గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే యెన్నం

మహబూబ్‌నగర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్ విధానం బాగుందని రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రశంసించారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం నల్గొండలో మంత్రిని కలిశారు. పాలమూరులో అమలు చేస్తున్న డిజిటల్ కంటెంట్ ప్రయోజనాలను ఆయనకు వివరించారు. దీనివల్ల పదో తరగతి ఫలితాలు మెరుగుపడినట్లు తెలిపారు. గతంలో తమ నియోజకవర్గంలో 60 - 65 శాతం ఉత్తీర్ణత ఉండేదని, విద్యార్థులకు డిజిటల్ స్టడీ మెటీరియల్‌ను అందించిన తర్వాత తొలి సంవత్సరం ఉత్తీర్ణత 21 శాతం పెరిగిందని తెలిపారు. రెండో సంవత్సరం విద్యార్థులు 92 శాతం ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. ఈ ఏడాది 100 శాతం ఫలితాలు సాధించేందుకు 'శత శాతం' అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టనట్లు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తమ నియోజకవర్గంలోనూ విద్యార్థులకు డిజిటల్ కంటెంట్‌ను అందిస్తామని, 10వ తరగతిలో వంద శాతం ఫలితాలే లక్ష్యంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

» డీడబ్ల్యూవో జరీనా బేగం


విజేతలకు బహుమతులు ప్రధానం చేస్తున్న జిల్లా మహిళ, శిశు, సంక్షేమా శాఖ అధికారి జరీనాబేగం

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని మహబూబ్‌నగర్ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి (డీడబ్ల్యూవో) జరీనా బేగం అన్నారు. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతి, జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా క్రీడాశాఖ ఆధ్వర్యంలో వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ప్రతిభావంతులైన క్రీడాకారులకు కొదవ లేదని, ఎంతోమంది రాష్ట్ర, జాతీయ స్థాయి ఎదిగారని గుర్తుచేశారు. జిల్లా క్రీడాశాఖ అధికారి ఎస్. శ్రీనివాస్ మాట్లాడుతూ ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో క్రీడాకారులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం విజేతకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రాజగోపాల్, సీనియర్ అసిస్టెంట్ రవీందర్‌రెడ్డి, కోచ్‌లు సునీల్, పర్వేజ్ పాషా పాల్గొన్నారు.

జాతీయ స్థాయి టోర్నీకి జిల్లా క్రీడాకారులు


రాజా రాంచరణ్


ఎస్. రాజేశ్వరి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : జాతీయస్థాయి యూత్ అండర్-18 బాస్కెట్‌బాల్ టోర్నీకి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. పంజాబ్ రాష్ట్రంలోని లూథియానాలో వచ్చే నెల 1వ తేదీ నుంచి నిర్వహించనున్న ఈ టోర్నీలో రాష్ట్ర బాలుర జట్టు తరఫున కౌకుంట్లకు చెందిన రాజా రాంచరణ్, బాలికల జట్టు నుంచి బాలనగర్‌లో ఈఎంఆర్ఎస్ విద్యార్థిని ఎస్. రాజేశ్వరి పాల్గొననున్నారు. రాజా రాంచరణ్ 2023లో పాండిచ్చేరి, 2024లో కోల్‌కతాలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. వారిని బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మక్సూద్‌బిన్ అహ్మద్ జాకేర్, నసరుల్లా హైదర్ అభినందించారు.

పరిహారం పెంచే వరకు సర్వే చేయొద్దు

» కానుకుర్తి రిజర్వాయర్ నిర్మాణానికి భూ సర్వే

» పోలీసు బందోబస్తుతో వచ్చిన అధికారులు

» అడ్డుకొని రాస్తారోకో చేపట్టిన రైతులు

» సొమ్మసిల్లి పడిపోయిన మహిళ


కానుకుర్తిలో సర్వే బృందానికి అడ్డుకొని రోడ్డుపై రాస్తారోకో నిర్వహిస్తున్న భూ నిర్వాసితులు

దామరగిద్ద, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : పరిహారం పెంచే వరకు సర్వేకు అంగీకరించేది లేదని రైతులు స్పష్టం చేశారు. భూ సర్వే చేసేందుకు వచ్చిన అధికారులను అడ్డుకొని, రాస్తారోకో చేపట్టారు. నారాయణపేట - కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా కానుకుర్తి రిజర్వాయర్‌ను నిర్మించనున్నారు. అందుకోసం భూమిని సర్వే చేసేందుకు డీఎస్పీ లింగయ్య, సీఐ శివశంకర్ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ శ్రీను, ఆర్డీవో రాంచందర్, తహసీల్దార్ తిరుపతయ్య, సర్వే సిబ్బంది శుక్రవారం ఉదయం 6 గంటలకే కానుకుర్తికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న రైతులు అక్కడికి చేరుకొన్నారు. తమకు సమాచారం ఇవ్వకుండా సర్వే చేయడమేంటని అధికారులతో వాగ్వాదానికి దిగారు. పరిహారం ఎంత ఇస్తారో చెప్పకుండా చర్య నిర్వహించడమేంటని నిలదీశారు. బహిరంగ మార్కెట్‌లో ఎకరానికి రూ. 60 లక్షలు పలుకుతుండగా, ప్రభుత్వం రూ. 14 లక్షలు పరిహారం ఇవ్వడం సరికాదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిహారం పెంచే వరకు సర్వే చేయొద్దంటూ నారాయణపేట - యానగింది రహదారిపై రాస్తారోకో చేపట్టారు. సర్వే ఆపాలంటూ కొందరు రైతులు పెట్రోల్ బాటిళ్లు పట్టుకొని నిరసన తెలిపారు. అధికారులు ఎంత నచ్చచెప్పినా వారు ఆందోళన విమరించలేదు. చివరకు అడిషనల్ కలెక్టర్ శ్రీను అక్కడికి చేరుకొని నాయకులు, రైతులతో మాట్లాడారు. సర్వే చేస్తేనే ఏ రైతుది ఎంత భూమి పోతుందో తెలుస్తుందని ఆయన వారికి తెలిపారు. ఎకరానికి ఎంత పరిహారం ఇస్తారో హామీ ఇవ్వాలని రైతులు ఆయనను కోరారు. తమకు ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శివకుమార్‌రెడ్డి శనివారం వరకు సమయం ఇచ్చారని తెలిపారు.

అందుకు ఒక రోజు సమయం ఇస్తామని, ఆ తర్వాత సర్వే నిర్వహిస్తామని అధికారులు వారికి స్పష్టం చేశారు. రాస్తారోకో చేస్తున్న సమయంలో ఓ మహిళా రైతు సొమ్మసిల్లి పడిపోయింది. తోటి రైతులు ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లారు.

ముగిసిన పీజీ పరీక్షలు


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, అబ్జర్వర్ డాక్టర్ కుమారస్వామి

పాలమూరు యూనివర్సిటీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీలో పీజీ 4, 2వ సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా పీయూ పీజీ ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, అబ్జర్వర్ డాక్టర్ కుమారస్వామిలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షలకు 1,196 మంది విద్యార్థులకు గాను, 1,113 మంది హాజరయ్యారని పీయూ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ప్రవీణ తెలిపారు. 83 మంది గైర్హాజరయ్యారని చెప్పారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు వడ్డెమాన్ విద్యార్థి


నంది వడ్డెమాన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

బిజినేపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండలంలోని నంది వడ్డెమాన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 10న కల్వకుర్తిలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థి పంబ గణేశ్ పెంటాథ్లాన్ అండర్-16 బాలుర విభాగంలో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మురళి మోహనాచార్యులు తెలిపారు. పాలమూరు యూనివర్సిటీలోని సింథటిక్ ట్రాక్‌పై రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మీపతి, ఉపాధ్యాయులు చంద్రమోహన్ రెడ్డి, నాగిరెడ్డి అభినందించారు.

నూతన ఆవిష్కరణలకు ప్రతాప్ కౌటిళ్య రచనలు ఊతం

» తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ డాక్టర్ బాలకిష్టా రెడ్డి


డాక్టర్ ప్రతాప్ కౌటిళ్యను సన్మానిస్తున్న తెలంగాణ ఉన్నత విద్య మండలి చైర్మన్ డాక్టర్ బాలకిష్టా రెడ్డి, జేడీ డాక్టర్ రాజేందర్ సింగ్

బిజినేపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : నూతన ఆవిష్కరణలకు ఊతం ఇచ్చేలా డాక్టర్ ప్రతాప్ కౌటిళ్య సైన్స్ రచనలు ఉన్నాయని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ డాక్టర్ బాలకిష్టా రెడ్డి కొనియాడారు. తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని పాలెం గ్రామానికి చెందిన సైన్స్ రచయిత ప్రతాప్ కౌటిళ్యను హైదరాబాద్‌లోని తన ఛాంబర్‌లో ఉన్నత విద్య జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రాజేందర్ సింగ్‌తో కలిసి శుక్రవారం ఘనంగా సన్మానించి అభినందించారు.

ఇంటర్వ్యూ..

గ్రామీణులు అప్రమత్తంగా ఉండాలి

- జ్యోషి శ్రీనివాస్‌శర్మ, తహసీల్దార్



మానవపాడు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యంలో ప్రజలు నిత్యం అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జ్యోషి శ్రీనివాస్‌శర్మ అన్నారు. మట్టి మిద్దెలు ఉన్నవారు ఇళ్లలో ఉండకూడదని చెప్పారు. మరిన్ని వివరాలను ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో వెల్లడించారు.

గ్రామాల్లో ఎలాంటి ఇబ్బందులను గుర్తించారు?

చాలాగ్రామాల్లో నేటికీ మట్టిమిద్దెలు ఉన్నాయి. నిత్యం వాన కురుస్తున్నందు వల్ల ముందుగానే వారంతా సురక్షిత ప్రాంతానికి వెళ్లిపోవడం మేలు. గ్రామ కార్యదర్శికి, అధికారులకు తెలియజేస్తే ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు.

వాగులు పొంగుతున్నాయి. ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

వర్షం వస్తే గ్రామాలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. వాగులు పొంగినప్పుడు రాకపోకలు చేయొద్దు.

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటారా?

ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు మాకు అందలేదు. వ్యవసాయ అధికారులు పంట నష్టాన్ని గుర్తిస్తారు.

గ్రామాల్లో పర్యటించారా?

సమస్యలు తెలుసుకునేందుకు, పరిష్కరించేందుకు అధికారులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారు. ప్రజలు మధ్యవర్తుల ద్వారా కాకుండా నేరుగా సంప్రదించాలి. సమస్యలు పరిష్కరించుకోవాలి.

పందులు సంచరిస్తున్నా పట్టించుకోరా?



కేజీబీవీలో తలుపులు లేని స్నానపు గదులు, మరుగుదొడ్లు

- ● అపరిశుభ్రతకు నిలయంగా మానవపాడు కేజీబీవీ
- ● తలుపులు లేని స్నానపు గదులు, మరుగుదొడ్లు ● వర్షానికి చిత్తడిగా పాఠశాల



బురదతో అపరిశుభ్రంగా ఉన్న పాఠశాల ఆవరణ, అక్కడే సంచరిస్తున్న పందులు

మానవపాడు, ఆగస్టు29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తుర్బాగాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) అపరిశుభ్రతకు నిల యంగా మారింది. వర్షాలకు పాఠశాల ఆవరణ చిత్తడిగా మారింది. దీనికితోడు పందులు సంచరిస్తున్నాయి. బురదమయంగా మారిన ఆవరణలోనే విద్యార్థినులు దుస్తులను ఆరేసుకుంటున్నారు. ఇక్కడ కేజీబీవీ పాఠశాలను 14ఏళ్ల క్రితం ఏర్పాటు చేశారు. ఏటా విద్యార్థుల సంఖ్య పెరుగుతుండటంతో తొమ్మిదేళ్ల క్రితం పాఠశాల భవనం ఏర్పాటుచేశారు. విద్యార్థుల సంఖ్య సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు ఐదు ఏర్పాటు చేశారు. వసతులు పూర్తిస్థాయిలో కల్పించలేదు. అంతేకాకుండా ఇంటర్ విద్యకు నూతన భవనం ఏర్పాటు చేస్తున్నారు. కానీ నిర్వహణలోపంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలకు ప్రహరీ ఉన్నప్పటికీ, డ్రైనేజీ వ్యవస్థ ఉన్న పాఠశాలలో మురుగు తాండవిస్తుంది. దీంతో విద్యార్థినులు రోగాల బారినపడుతున్నారు. పాఠశాలకు గతంలో వేడినీటిని తయారు చేసే పరికరాన్ని అందించినప్పటికీ ప్రస్తుతం ప్రయోజనం చేకూరడంలేదు. విద్యార్థినులు రోగాల బారినపడితే ఇష్టానుసారంగా వదిలేస్తున్నారు. అనారోగ్యంగా ఉన్న ఆరి తల్లిదండ్రులను పిలిపించి ఇంటికి పంపడం పరిపాటిగా మారింది. ఇప్పటికీ ఇలా పాఠశాల నుంచి పదిమంది విద్యార్థినులను పంపించారు. వివిధ సమస్యలతో నిత్యం ఇబ్బందిపడుతున్న విద్యార్థులు మాట్లాడుతూ తమకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాలని, ప్రస్తుత సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతున్నారు.

మందుల కొరత ఎక్కువగా ఉంది



మాలో ఎవరు అనారోగ్యం బారినపడినా, పాఠశాలలో మందులు ఉండడం లేదు. రాత్రివేళ జ్వరం వస్తే అలాగే ఉంటున్నాము. పాఠశా లకు ప్రత్యేక మందుల కోట ఉండాలి. స్నానపు గదులకు ఏళ్లుగా తలుపులు లేవు.. ఒక రు స్నానం చేస్తే మరొకరు అడ్డుగా ఉండాలి. చాలా ఇబ్బందిపడుతున్నాము. ఎవరూ పట్టించుకోవడం లేదు.

- రాధిక, 10వ తరగతి

ఉన్నతాధికారులకు చెప్పాం..



పాఠశాల సమస్యలపై ఉన్నతాధికారులకు తెలిపాం. పాఠశాల ఆవరణ, స్నానపు గదులు, తరగతి గదులు, మందుల కొరత సమస్యలపై కూడా తెలియజేశాం. ప్రస్తుతం తరగతి గదులు లేకపోవడంతో మరిన్ని సమస్యలు వస్తున్నాయి. విద్యార్థినులకు అన్ని వసతులు కల్పిస్తేనే ఆరోగ్యంగా ఉంటారని కూడా తెలిపాం.

- జ్యోతి, ఎస్‌వో

ప్రతీ గ్రామంలో యూరియా అందించాలి

● కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాలన్యూటౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో పంటకోత ప్రయోగాలు, డిజిటల్ క్రాప్ బుకింగ్, యూరియా సరఫరా సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీవోసీ సమావేశపు హాలులో భారత ప్రభుత్వం రూపొందించిన డిజిటల్ యాప్ ద్వారా పంట కోత ప్రయోగాలను నిర్వహించే విధానంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ డిజిటల్ యాప్ ద్వారా పంట కోత ప్రయోగాలను సరిగా నిర్వహించడం ఎంత ముఖ్యమో వివరించారు. డిజిటల్ క్రాప్ బుకింగ్ సౌకర్యం ద్వారా రైతుల అవసరాలను తీర్చడం, ప్రతి గ్రామంలో అవసరమైన యూరియా సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ముఖ్యప్రణాళిక అధికారి యోగానంద్, జిల్లా వ్యవసాయ అధికారి సక్రియనాయక్, సహాయ వ్యవసాయ అధికారి సంగీతలక్ష్మి, ఉప గణాంక అధికారులు నాగార్జునుడు, హరికృష్ణ, హైమావతి, మండల వ్యవసాయ, మండల ప్రణాళిక అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు ఉన్నారు.

● ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తిచేయాలని కలెక్టర్ అన్నారు. శుక్రవారం ఐడీవోసీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హా లులో ఎంపీడీవోలతో మండలాల వారీగా ఇళ్ల నిర్మాణ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎలాంటి సమస్యలైనా అధిగమిస్తూ ప నులు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో హౌ సింగ్ పీడీ శ్రీనివాసరావు, డీఈ కాశీనాథ్, డీపీ వో నాగేంద్రం, ఎల్‌డీఎం శ్రీనివాసరావుఉన్నారు.

కోర్టుకు వెళ్లిన లబ్ధిదారులకు న్యాయం చేయాలి

గద్వాలన్యూటౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): దౌదర్‌పల్లి వద్ద ప్రభుత్వం ఇచ్చిన ప్లాట్లను పోగొట్టుకొని కోర్టుకు వెళ్లిన లబ్ధిదారులకు వెంటనే న్యాయం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు కోరారు. శుక్రవారం పార్టీ ఆధ్వర్యంలో కలెక్టర్ బీఎం సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. 2018లో అప్పటి ఎమ్మెల్యే డీ.కె.అరుణ పట్టణ ప్రజలకు 1700 ప్లాట్‌లు ఇచ్చారని, 2021లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం వీటిని లాక్కొని డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లను మెడికల్ కాలేజీలను నిర్మిస్తామని చెప్పిందన్నారు. దీనికి నిరసనగా దాదాపు 700మంది లబ్ధిదారులు హైకోర్టుకు వెళ్లగా, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలని తీర్పుఇచ్చిందని తెలిపారు. ఈమేరకు వారికి ఇళ్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రవికుమార్ ఎగ్బోటే, బండల వెంకట్రాములు, రమాదేవి, వెంకటేశ్వరెడ్డి, నల్లారెడ్డి, హనిమిరెడ్డి, మీర్జాపురం వెంకటేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

ఓటరు తుది జాబితా రూపకల్పనకు సహకరించాలి

● అదనపు కలెక్టర్ నర్సింగరావు

గద్వాలన్యూటౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రాలు, గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 30వరకు తెలియజేయాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి అవసరమైన మార్పులు చేర్పుల తర్వాత సెప్టెంబరు 2న ఓటరు తుదిజాబితాను ప్రకటిస్తామన్నారు. శుక్రవారం ఆయన తన చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీపీవో నాగేంద్రం, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉన్నారు.

చేనేత రుణమాఫీ అమలు చేయాలి

● కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

గద్వాల న్యూటౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన చేనేత రుణమాఫీని తక్షణమే అమలు చేయాలని కోరుతూ సమాచార హక్కు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ బీఎం సంతోష్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కొంతమంది చేనేత కార్మికులకు బ్యాంకు అధికారులు వసూళ్లకు ఒత్తిడి చేస్తున్నారని, దీంతో చేనేత కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎం.డి. నిషాక్, తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మ్యాడం రామకృష్ణ, పోతు వీరేశ్, వీరన్న, మ్యాడం వెంకటేశ్ ఉన్నారు.

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

గద్వాల న్యూటౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అన్నివిభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేరు నరసింహ అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం సమర్పించారు. అనంతరంమాట్లాడుతూ కార్మికులను ఒప్పంద, పొరుగుసేవల పేరుతో చేస్తున్న శ్రమదోపిడీని ఆపాలని, ఇకనైనా వారికి ఉద్యోగ భద్రత కల్పించి, వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ. 26వేలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయితీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మన్న, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు దేవన్న, మన్యం, నవీన్, శ్రీహరి, చందు, మహేశ్ ఉన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పాటు అవసరం

- **● ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి**
- **● స్టాల్స్‌ను పరిశీలించిన కలెక్టర్, అదనపు కలెక్టర్ నర్సింగరావు**



ఆహార ఉత్పత్తులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, అదనపు కలెక్టర్ నర్సింగరావు



చేతిబ్యాగులు, పర్యావరణ హిత వస్తువులను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్. అదనపు కలెక్టర్

గద్వాల టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా ప్రభుత్వ పరంగా తగిన తోడ్పాటునందించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. నీతి ఆయోగ్-ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్‌లో భాగంగా శుక్రవారం పట్టణంలోని అనంత కన్వెన్షన్‌హాల్‌లో మహిళా స్వయం సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ఆకాంక్ష హాట్ - ఎగ్జిబిషన్ అండ్ సేల్ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ నర్సింగరావుతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే, ఇలాంటి కార్యక్రమాల ఏర్పాటు వల్ల మహిళల్లో సృజనాత్మకత, నైపుణ్యం మరింత వెలుగులోకి వస్తుందన్నారు. అక్కడే ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించిన ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్, మహిళలు తయారు చేసిన పర్యావరణ హిత వస్తువులను పరిశీలించి అభినందించారు. వారి ఉత్పత్తులకు రాష్ట్రస్థాయిలో మార్కెట్ లభించేలా ప్రభుత్వపరంగా తగిన సహకారం అందించేందుకు కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ జానకీరామ్ సాగర్, జిల్లా పరిశ్రమ కేంద్రం జనరల్ మేనేజర్ రామలింగేశ్వరగౌడ్, జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి వెంకటేశ్వర్లు, మిషన్ భగీరథ ఈఈ శ్రీధర్ రెడ్డి, నాయకులు మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ గడ్డం కృష్ణారెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ భాస్కర్, జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీలకు చెందిన మెప్మా సిబ్బంది ఉన్నారు.

● శిల్పారామంలో గద్వాల చీరల ప్రదర్శన

గద్వాల జరీ, చేనేత చీరల ఉత్పత్తుల నాణ్యత, నైపుణ్యతను మరింత విస్తృత ప్రచారం కల్పించేందుకు వీలుగా హైదరాబాద్ శిల్పారామంలో ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేస్తామని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. పట్టణంలోని అనంత కన్వెన్షన్ హాల్‌లో స్వయం సహాయక మహిళ సంఘాల చేతి ఉత్పత్తుల స్టాళ్ల ప్రదర్శనను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కలెక్టర్, మహిళలు ప్లాస్టిక్ వినియోగించకుండా పర్యావరణ హితంగా, వ్యవసాయ వ్యర్థాల ఆధారికంగా తయారుచేసిన వస్తువులకు తగిన మార్కెట్ లభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇండస్ట్రియల్ పార్క్‌లో స్థలం కేటాయించడంతో పాటు బ్యాంకులద్వారా సబ్సిడీ అవకాశంతో రుణసౌకర్యం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మహిళలు తమ నైపుణ్యానికి మరింత పదును పెట్టి నాణ్యత గల వస్తువులను ఉత్పత్తి చేయడం ద్వారా మార్కెట్‌లో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఏపీడీ శ్రీనివాస్, గట్టు ఎంపీడీవో చెన్నయ్య ఉన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

- రాజోలి, అయిజ మండలాల్లో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే



పెద్ద ధన్వాడలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుకు రూ.లక్ష చెక్కును ఇస్తున్న సంపత్‌కుమార్

రాజోలి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దధన్వాడలో అభివృద్ధి పనులను పరిశీలించేందుకు ఏఐసీసీ కార్యదర్శి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే ఎస్ఏ సంపత్‌కుమార్ శుక్రవారం అలంపూర్ మార్కెట్‌యార్డు చైర్మన్ దొడ్డప్ప, వైస్ చైర్మన్ పచ్చర్ల కుమార్, రాజోలి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దస్తగిరి, నాయకులతో కలిసి పర్యటించారు. అయిజ మండలం చిన్నతాండ్రపాడు నుంచి పెద్ద ధన్వాడ వరకు ప్రధాన రహదారికి ఎర్రమట్టి వేసే పనులను, పెద్దధన్వాడలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను ఆయన పరిశీలించారు. మొదటి విడత రూ.లక్ష చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఆయన పర్యటనకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో గ్రామంలో మరోసారి భయాందోళనలు నెలకొన్నాయి. ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేఖ పోరాట కమిటీ సభ్యులను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. సోషల్ మీడియాలో వ్యతిరేఖ పోస్టులు పెడుతున్నవారిని గుర్తించి అదుపులోకి తీసుకుంటున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

● ఎంజేపీని సందర్శించిన ఆర్డీవో



కందిపప్పు పరిశీలిస్తున్న ఆర్డీవో అలివేలు

అలంపూరుచౌరస్తా,ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గురుకులాల్లో నాణ్యమైన అహారం అందించాలని గద్వాల ఆర్డీవో అలివేలు అన్నారు. ఉండవల్లి తహసీల్దారు ప్రభాకర్‌తో కలిసి శుక్రవారం అలంపూరు చౌరస్తాలోని మహాత్మాజ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలను సందర్శించారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో గురుకులంలో ఎలుకల బెడద అనే కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఏదో ఒక అధికారి పాఠశాలను సందర్శిస్తూ సలహాలు, సూచనలిస్తున్నారు. శుక్రవారం ఆర్డీవో అలివేలు వచ్చారు. వంటగదిలోని కురగాయలను, బియ్యం, పప్పులను పరిశీలించారు. వంటకు తాజా కూరగాయలే ఉపయోగించాలని, మంచినీరు వాడాలని, వంట సామాగ్రి ఎప్పటికప్పుడు శుభ్రంగా కడగాలని, వంటశాలలో ఉన్నవారు శుచి, శుభ్రత తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అలాగే తలకు టోపి ధరించాలని, మన ఇంట్లో మన పిల్లలకు ఎలా వండుతామో అలాగే భావించాలని చెప్పారు.

అనంతరం మరమ్మతులకు గురైన ఆర్‌వో ప్లాంటును పరిశీలించారు. ఏదో జరిగిందని పత్రికల్లో వస్తేనే అందరూ వస్తారని ఆ తర్వాత ఎవరూ రారని అందులో పని చేసే ఓ ఉపాధ్యాయుడు పెదవి విరిచాడు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని గంజిపేటలో ఉన్న సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ కోసం శనివారం ఉదయం 7గంటల నుంచి 9గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని గంజిపేట, బురదపేట, సుంకులమ్మ టెంపుల్, న్యూబస్టాండ్ ఏరియా, గాంధీచౌక్, ఓల్డ్ బస్టాండ్, శేరెల్లివీధి, రాజావీధి, కృష్ణారెడ్డిబంగ్లా, గంటవీధి, రాజయ్యతోట, వేదనగర్, రాఘవేంద్ర కాలనీ, తెలుగుపేట, రాంనగర్ తేరుమైదానం, కుంటవీధి, వడ్లవీధి, చేపల మార్కెట్ ఏరియా, బీసీకాలనీ, అయిజరోడ్, మెడకల్ కాలేజి ఏరియా, దౌదర్‌పల్లి, కొత్తపల్లి, పిల్లిగుండ్ల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలన్నారు.

బీచుపల్లి వద్ద నిమజ్జనం ఏర్పాట్లు

ఎర్రవల్లి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): బీచుపల్లి దగ్గర కృష్ణానదిలో వినాయక నిమజ్జనానికి అన్ని శాఖల అధికారులు ఏర్పాట్లు చేశారు. మూడు రోజుల పాటు కొలువుదీరిన గణపయ్యను శుక్రవారం కొందరు నిమజ్జనానికి తరలిస్తున్నారు. దీంతో కృష్ణానదికి నిమజ్జనానికి తెచ్చిన విగ్రహాల తరలింపునకు క్రేన్ ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ రవి బాబు, ఎస్ఐ రవి కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. తహసీల్దార్ నరేశ్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ స్థాయి క్రీడా దినోత్సవం



స్పోర్ట్స్ డే ఆకారంలో మానవహారంగా బాలికల మైనారిటీ సంక్షేమ విద్యార్థులు



క్రీడా దినోత్సవంలో విద్యార్థినుల ప్రదర్శన



పాతపాలెంలో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

అలంపూరు చౌరస్తా/ వడ్డేపల్లి/ కేటీదొడ్డి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్రీడాదినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉండవల్లిలోని మైనారిటీ సంక్షేమ హాస్టల్‌లో పీఈటీ టీచర్ అరుణతార ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. క్రీడాదుస్తుల్లో పిల్లలకు పలుఆటలు ఆడించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎలిజబేత్, సుహసిని ఉన్నారు.

● వడ్డేపల్లి : శాంతినగర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రముఖ రచయిత, సాహితీవేత్త, వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని జరపుకున్నారు. ఈసందర్భంగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి ప్రిన్సిపాల్, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ కే.రామ ఓబులేష్ మాట్లాడుతూ వ్యవహారిక భాష గొప్పతనానికి గిడుగు రామమూర్తి చేసిన కృషి గురించి వివరించారు. అలాగే ధ్యాన్‌చంద్ జీవిత చరిత్ర, హాకీ ఆట ప్రత్యేకత, క్రీడల వల్ల కలిగే లాభాలు, శారీరక ఉల్లాసం గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌జే సంపత్ కుమార్, అధ్యాపకులు ఏడుకొండలు, రాఘవేందర్, జీవ జయరాజు, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు ఉన్నారు.

● కేటీదొడ్డి : మండలంలోని పాతపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాఘవేంద్ర, ఫిజికల్ డైరెక్టర్ మోహన్ మురళి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా, తెలుగు భాషా దినోత్సవం

గద్వాల టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామమూర్తి పంతులు, ధ్యాన్‌చంద్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్‌బాషా, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమోహన్, అధ్యాపకులు రాధిక, మేడిచర్ల హరినాగభూషణం, ఫిజికల్ డైరెక్టర్ కరుణాకర్, సూపరింటెండెంట్ రమేశ్‌కుమార్ ఉన్నారు.

వినాయకుడికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



ఐడీఎస్‌ఎంటీ కాలనీలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల న్యూటౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఐడీఎస్‌ఎంటీ కాలనీలోని వినాయకుడికి శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువా పూల బొకేతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయ్, మాజీ కౌన్సిలర్లు శ్రీను ముదిరాజ్, మురళి, కమిటీ సభ్యులు చిరు ముదిరాజ్, చెన్నకేశవులు, హనుమంతు, వెంకటేశ్, ఉషకుమార్ ఉన్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

గద్వాల అర్బన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుల సమస్యలు తెలుసుకోవడంతో పాటు వారి నుంచి సూచనలు, సలహాలు స్వీకరించేందుకుగాను ఈనెల 30వ తేదీ శనివారం ఉదయం 11 గంటల నుంచి 12గంటల వరకు 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గద్వాల ఆర్టీసీ డిపో మేనేజర్ సునీత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు సెల్ నెం. 9959226290 కు కాల్‌చేసి సూచనలు, సలహాలు ఇవ్వాలని డీఎం కోరారు.

కార్మికుల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలి

● ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి కార్తీక్

గద్వాల టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ, మునిసిపల్ పట్టణాల్లో పని చేస్తున్న కార్మికుల రాష్ట్ర సదస్సు సెప్టెంబరు 7న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞానకేంద్రంలో నిర్వహిస్తున్నట్లు ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి కార్తీక్ తెలిపారు. ఆ పోస్టర్లను శుక్రవారం పట్టణంలోని యూనియన్ కార్యాలయం వద్ద విడుదల చేశారు. ఈసందర్భంగా మాట్లాడిన కార్తీక్, గ్రామాలు పట్టణాల్లో పారిశుధ్య సేవలు మొదలుకుని పలు పౌర సేవలు అందిస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అందకపోవడం శోచనీయమని, సౌకర్యాల కల్పనలో మొండిచేయి చూపుతుండటం విచారకరమన్నారు. జిల్లాలోని జీపీ మునిసిపల్ కార్మికులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో బజారమ్మ, శ్రావణి, రాముడు, బుడ్డన్న, తిమ్మన్న, గోవిందు ఉన్నారు.

రైతుల సేవే లక్ష్యం

అయిజ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రైతులకు సేవలు అందించటమే సింగిల్ విండో లక్ష్యమని అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం యూరియా కోసం శుక్రవారం రైతులు బారులు తీరి ఉన్నారు. వేకువజాము నుంచి ఉండడంతో మధుసూదన్‌రెడ్డి క్యూలైన్‌లోని రైతు లకు మంచినీరు, తేనీరు సరఫరా చేశారు.

జోగుళాంబకు కర్ణాటక మంత్రి పూజలు

అలంపూర్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఐదవ శక్తిపీఠం జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి వార్లను శుక్రవారం కర్ణాటక రాష్ట్ర మైనర్ ఇరిగేషన్ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి బోసురాజు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అంతకుముందు ఆలయాన్ని చేరుకున్న వారికి ఏఐసీసీ కార్యదర్శి ఎస్ఏ సంపత్‌కుమార్, ఆలయ అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ

అయిజ టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): అయిజలోని బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం క్రీడాదుస్తులను ఉచితంగా అందజేశారు. క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని 1990-91 విద్యాసంవత్సరంలో ఏడవ తరగతికి చెందిన పూర్వ విద్యార్థులు భూమిక, సుధామణి, పద్మ, భువనేశ్వరి, శ్రీలత, కవిత, శ్రీదేవి, 1991-92 బ్యాచ్‌కు చెందిన రజిత కలిసి 220మంది విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం తిమ్మప్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేతనాలు ఇప్పించాలి సారూ..

అలంపూరుచౌరస్తా, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గత ఆరు నెలలుగా తమకు జీతాలు రావడంలేదని, వెంటనే నిధులు విడుదల చేయించాలని కార్మికులు కోరారు. శుక్రవారం జోగుళాంబ ఆలయాలను దర్శించుకునేందుకు వచ్చిన డా. ఎస్ఏ సంపత్‌కుమార్‌ను అలంపూరు మునిసిపల్ కార్మికులు కలిశారు. వినతిపత్రం అందించారు. స్పందించిన ఆయన కలెక్టర్‌తో మాట్లాడి జీతాలు వచ్చేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. భైరాపురంలో బ్రిడ్జికి రెండువైపులా అప్రోచ్ రోడ్డు నిర్మించాలని గ్రామస్థులు, మాజీ సర్పంచ్ రమణ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు.

ఈ ఆఫీసుకు బురదలో నుంచే వెళ్లాలి!



ఉండవల్లి ఎంపీడీవో కార్యాలయం వద్ద నిలిచిన వాననీరు

అలంపూరుచౌరస్తా, ఆగస్టు29 (ఆంధ్రజ్యోతి) : ఉండవల్లి మండల పరిషత్ కార్యాలయం చుట్టూ వాననీరు నిలిచి బురదమయంగా మారింది. దీంతో ఈ కార్యాలయానికి వచ్చే వారు బురదలో నుంచే రావాల్సి వస్తోంది. రెండ్రోజులుగా సమస్య ఉన్నా ఎవరూ పట్టించుకోకపోవడం లేదు. అధికారుల నిర్లక్ష్యంపై మండల ప్రజలు నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.